భారత ప్రభుత్వము

శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

(శాసన నిర్మాణ విభాగము)

सत्यमेव जयते

# జనన మరణముల రిజిస్ట్రీకరణ చట్టము, 1969

(1969 లోని 18వ చట్టము)

*[1 జూన్, 1991న ఉన్నట్లుగా]*

# The Registration of Births and Deaths Act, 1969

**(Act 18 of 1969)**

*[As on 1st June, 1991]*

భారత ప్రభుత్వము తరఫున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముద్రణాలయ కమీషనరుగారిచే ప్రభుత్వ కేంద్ర ముద్రణాలయము,
హైదరాబాదునందు ముద్రించి ప్రచురించబడినది.
1991

మూల్యము : రూ. 10-50

# అవతారిక

ఈ ముద్రణలో 1 జూన్, 1991న ఉన్నట్లుగా ది రిజిస్ట్రేషన్ ఆఫ్ బర్త్స్ అండ్ డెత్స్ యాక్ట్, 1969 (1969లో 18వ చట్టము) యొక్క ప్రాధికృత తెలుగు పాఠము కలదు. ఈ పాఠమును 26 అగస్టు, 1991 తేదీగల భారత రాజపత్రము, అసాధారణ భాగము XVI అనుభాగము 1, సంఖ్య 6, సంపుటము 6లో 453 నుండి 462 వరకుగల పుటలలో ప్రచురించడమైనది.

ఈ తెలుగు పాఠమును, రాష్ట్రపతి ప్రాధికారము ననుసరించి ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఏ) క్రింద ప్రచురించడమైనది. అట్లు ప్రచురించినమీదట, ఈ అనువాదము ఆ చట్టమునకు ప్రాధికృత తెలుగు పాఠమైనది.

న్యూఢిల్లీ,
తేదీ: 31 అగష్టు, 1991.

వి.యస్. రమాదేవి,
కార్యదర్శి, భారత ప్రభుత్వము.

# PREFACE

This edition of The Registration of Births and Deaths Act, 1969 (Act 18 of 1969) as on 1st June, 1991 contains the authoritative Text of that Act in Telugu which was published in the Gazette of India, Extraordinary Part XVI, Section 1, No. 6, Vol. 6, dated 26th August, 1991 on pages from 453 to 462.

This Telugu text was published under the authority of the President under clause (a) of Section 2 of the Authoritative Texts (Central Laws) Act, 1973, and on such publication it became the authoritative text of that Act in Telugu.

New Delhi,
Dated: 31st August, 1991.

**V.S. RAMA DEVI,**
Secretary to Govt. of India .

# జనన మరణముల రిజిస్ట్రీకరణ చట్టము, 1969.

## పరిచ్ఛేదక్రమము

పరిచ్ఛేదము | పుట

### అధ్యాయము 1.

### ప్రారంభిక.


1. సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము. .. 1
2. నిర్వచనములు మరియు అర్థాన్వయము. .. 1


### అధ్యాయము 2.

### రిజిస్ట్రీకరణ—సిబ్బంది.


3. భారత రిజిస్ట్రారు—జనరలు. .. 2
4. ముఖ్య రిజిస్ట్రారు. .. 2
5. రిజిస్ట్రీకరణ డివిజనులు. .. 2
6. జిల్లా రిజిస్ట్రారు. .. 2
7. రిజిస్ట్రారు. .. 3


### అధ్యాయము 3.

### జనన మరణముల రిజిస్ట్రీకరణ.


8. జనన మరణములను రిజిస్టరు చేయవలసిన వ్యక్తులు. .. 3
9. ప్లాంటేషనులోని జనన మరణముల గురించి ప్రత్యేక నిబంధన. .. 4
10. జనన మరణములను తెలియపరచుట మరియు మరణ కారణములను ధ్రువపరచుట కొందరు వ్యక్తుల కర్తవ్యమైయుండుట. .. 5
11. సమాచారము అందించు వ్యక్తి రిజిస్టరులో సంతకము చేయవలసియుండుట. .. 5
12. రిజిస్టరు చేసిన నమోదుల ఉదాహృతులను సమాచారమందించు వ్యక్తికి ఈయవలసియుండుట. .. 5
13. జనన మరణములను ఆలస్యముగా రిజిస్టరు చేయుట. .. 5
14. శిశువు పేరు రిజిస్టరు చేయుట. .. 6
15. జనన మరణముల రిజిస్టరులోని నమోదును సరిచేయుట లేక రద్దుచేయుట. .. 6


### అధ్యాయము 4.

### రికార్డుల మరియు గణాంకముల నిర్వహణ.


16. రిజిస్ట్రారుల్ల రిజిస్టర్లను విహిత ప్రరూపములో ఉంచవలసియుండుట. .. 6
17. జనన మరణముల రిజిస్టరు సోదా చేయుట. .. 6
18. రిజిస్ట్రీకరణ కార్యాలయముల తనిఖీ. .. 7
19. రిజిస్ట్రారుల్ల నియతకాలిక వివరణులను సంకలనము కొరకు ముఖ్య రిజిస్ట్రారుకు పంపవలసియుండుట. .. 7

పరిచ్ఛేదము | పుట

## అధ్యాయము 5.

## వివిధ విషయములు.

20. భారతదేశము వెలుపలనున్న పౌరుల జనన మరణముల రిజిస్ట్రీకరణను గూర్చి ప్రత్యేక నిబంధన. .. 7
21. జననము లేక మరణమును గురించిన సమాచారమును సేకరించుటకు రిజిస్ట్రారుకుగల అధికారము. .. 8
22. ఆదేశములిచ్చుటకు గల అధికారము. .. 8
23. శాస్తులు. .. 8
24. అపరాధములను రాజీచేయుటకు అధికారము. .. 8
25. అభియోగమునకు మంజూరి. .. 9
26. రిజిస్ట్రార్లు మరియు సబ్-రిజిస్ట్రార్లు పబ్లిక్ సేవకులుగా భావించబడుట. .. 9
27. అధికారముల ప్రత్యాయోజనము. .. 9
28. సద్భావపూర్వకముగ తీసికొనిన చర్యకు రక్షణ. .. 9
29. ఈ చట్టము, 1886 లోని 6వ చట్టమునకు భంగము కలిగించకుండుట. .. 9
30. నియమములు చేయుటకు అధికారము. .. 9
31. రద్దు మరియు వ్యావృత్తి. .. 10
32. చిక్కు తొలగించుటకు అధికారము. .. 10

# జనన మరణముల రిజిస్ట్రీకరణ చట్టము, 1969.

(1969 లోని 18వ చట్టము)

(31 మే, 1969)

జనన మరణముల రిజిస్ట్రీకరణను క్రమబద్ధము చేయుటకు మరియు దానికి సంబంధించిన విషయములను గూర్చి నిబంధనలు చేయుటకైన చట్టము.

భారత గణరాజ్యము యొక్క ఇరువదవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయనైనది:-

## అధ్యాయము 1.

## ప్రారంభిక.

1. (1) ఈ చట్టమును జనన మరణముల రిజిస్ట్రీకరణ చట్టము, 1969 అని పేర్కొనవచ్చును. సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము.

(2) ఇది యావద్భారత దేశమునకు విస్తరించును.

(3) ఇది రాజపత్రములో అధిసూచన ద్వారా, కేంద్ర ప్రభుత్వము నియతము చేయునట్టి తేదీన ఏ రాజ్యములోనైనను అమలులోనికి వచ్చును:*

అయితే ఒక రాజ్యములోని వేరు వేరు భాగములకు వేరు వేరు తేదీలు నియతము చేయవచ్చును.

2. (1) ఈ చట్టములో సందర్భమునుబట్టి అర్థము వేరుగా ఉన్ననే తప్ప,- నిర్వచనములు మరియు అర్థాన్వయము.

(ఏ) "జననము" అనగా సజీవ జననము లేక నిర్జీవ జననము అని అర్థము;

(బీ) "మరణము" అనగా సజీవ జననము పిమ్మట ఏ సమయముననైనను జీవ లక్షణములన్నియు శాశ్వతముగా కనిపించకుండ పోవుట అని అర్థము;

(సీ) "భ్రూణ మరణము" అనగా, గర్భధారణ కాలావధి ఎంతయైనను, తల్లి నుండి పిండమును పూర్తిగా బయట పడగొట్టుటకు లేక బయటికి లాగివేయుటకు పూర్వమే జీవ లక్షణములేవియు దానిలో లేకుండుట అని అర్థము;

(డీ) "సజీవ జననము" అనగా, గర్భధారణ కాలావధి ఎంతయైనను, తల్లి నుండి బయటపడిన పిమ్మట లేక బయటికి లాగివేయబడిన పిమ్మట ఊపిరి పీల్చు లేక జీవము ఉన్నట్లు అన్య లక్షణములను కనపరచు పిండము తల్లినుండి బయటపడుట లేక తల్లినుండి లాగివేయబడుట అని అర్థము; మరియు అట్లు జన్మించిన ప్రతి ఉత్పత్తి సజీవ జనితముగా భావించనగును;

(ఈ) "విహిత" అనగా ఈ చట్టము క్రింద చేసిన నియమముల ద్వారా విహితపరచిన అని అర్థము;

(ఎఫ్) సంఘ రాజ్యక్షేత్రమునకు సంబంధించి "రాజ్య ప్రభుత్వము" అనగా దాని పాలకుడు అని అర్థము;

(జీ) "నిర్జీవ జననము" అనగా పిండమునకు కనీసము విహిత గర్భకాలావధి నిండినటువంటి భ్రూణ మరణము అని అర్థము.

---

*ఈ చట్టము, ఆంధ్రప్రదేశ్ రాజ్యములో 1-4-1970 తేదీ నుండి అమలులోనికి వచ్చింది. భారత రాజపత్రము II వ భాగము పరిచ్ఛేదము 3(i)పేజీ 966లో ప్రచురిత మైన 7-3-1970 తేదీగల అధిసూచన నెం. జీ.ఎస్.ఆర్. 461ను చూడండి.

(2) ఏదేని ప్రాంతములో అమలులో లేని ఏదేని శాసనమును గూర్చి ఈ చట్టములోని నిర్దేశమేదైనను, ఆ ప్రాంతములో తత్సమానమైన శాసనము ఏదేని అమలునందున్నయెడల ఆ శాసనమును గూర్చిన నిర్దేశముగా అన్వయించబడవలెను.

## అధ్యాయము 2.

## రిజిస్ట్రీకరణ-సిబ్బంది.

భారత రిజిస్ట్రారు-జనరలు.

3. (1) కేంద్ర ప్రభుత్వము రాజపత్రములో అధిసూచన ద్వారా భారత రిజిస్ట్రారు-జనరలు అనబడు ఒక వ్యక్తిని నియమించవచ్చును.

(2) ఈ చట్టము క్రింద రిజిస్ట్రారు-జనరలు యొక్క కృత్యములలో, ఆయా సమయములలో నిర్వహించవలసినదిగా ఆయన ప్రాధికారమిచ్చునట్టి కృత్యములను ఆయన అధీక్షణాదేశముల క్రింద నిర్వహించు నిమిత్తము కేంద్ర ప్రభుత్వము తాను సబబని తలచునట్టి పదాభిధానములతో ఇతర అధికారులను కూడ నియమించవచ్చును.

(3) రిజిస్ట్రారు-జనరలు ఈ చట్టము విస్తరించునట్టి రాజ్యక్షేత్రములలో జనన మరణముల రిజిస్ట్రీకరణ గురించి సాధారణ ఆదేశములు జారీచేయవచ్చును. మరియు ముఖ్య రిజిస్ట్రార్ల కార్యకలాపములను జనన మరణముల రిజిస్ట్రీకరణ విషయములో సమన్వయ పరచుటకును, ఏకీకరించుటకును చర్యలు తీసికొనవలెను. మరియు సదరు రాజ్యక్షేత్రములలో ఈ చట్టము అమలు అగు తీరును గురించి వార్షిక రిపోర్టును కేంద్ర ప్రభుత్వమునకు సమర్పించవలెను.

ముఖ్య రిజిస్ట్రారు.

4. (1) రాజ్య ప్రభుత్వము రాజపత్రములో అధిసూచన ద్వారా రాజ్యము కొరకు ఒక ముఖ్య రిజిస్ట్రారును నియమించవచ్చును.

(2) ముఖ్య రిజిస్ట్రారు కృత్యములలో ఆయన ఆయా సమయములలో నిర్వహించవలసినదిగా ప్రాధికారమిచ్చునట్టి కృత్యములను ఆయన అధీక్షణాదేశముల క్రింద నిర్వహించు నిమిత్తము రాజ్య ప్రభుత్వము తాను సబబని తలచునట్టి పదాభిదానములతో ఇతర అధికారులను కూడ నియమించవచ్చును.

(3) రాజ్య ప్రభుత్వము ఏవైన ఆదేశములు ఇచ్చినయెడల వాటికి లోబడి, ఈ చట్టము యొక్క నిబంధనలను, వాటి క్రింద చేయబడిన నియమములను, ఉత్తరువులను అమలుపరచుటకు ముఖ్య రిజిస్ట్రారు రాజ్యములో ముఖ్య కార్యపాలక ప్రాధికారియైయుండును.

(4) సమర్థమైన రిజిస్ట్రీకరణ పద్ధతిని సమకూర్చుటకుగాను యథోచిత అనుదేశములను జారీచేయుట ద్వారా కాని, అన్యథా కాని, రాజ్యములో రిజిస్ట్రీకరణ పనిని సమన్వయ పరచుటకును, ఏకీకరించుటకును మరియు పర్యవేక్షించుటకును ముఖ్య రిజిస్ట్రారు చర్యలు తీసుకొనవలెను మరియు 19వ పరిచ్ఛేదము యొక్క ఉప పరిచ్ఛేదము (2)లో నిర్దేశించిన గణాంక రిపోర్టుతోపాటు రాజ్యములో ఈ చట్టము పనిచేయు తీరును గూర్చిన రిపోర్టును విహితపరచునట్టి రీతిగాను అట్టి అంతరావధుల తోను రాజ్య ప్రభుత్వమునకు సమర్పించవలెను.

రిజిస్ట్రీకరణ డివిజనులు.

5. రాజ్య ప్రభుత్వము, రాజపత్రములో అధిసూచన ద్వారా, రాజ్యములోని రాజ్యక్షేత్రమును తాను సబబని తలచునట్టి రిజిస్ట్రీకరణ డివిజనులుగా విభజించవచ్చును. మరియు వేరు వేరు రిజిస్ట్రీకరణ డివిజనులకు వేరు వేరు నియమములను విహితపరచ వచ్చును.

జిల్లా రిజిస్ట్రారు.

6. (1) రాజ్య ప్రభుత్వము, ఒక్కొక్క రెవెన్యూ జిల్లాకు ఒక జిల్లా రిజిస్ట్రారును మరియు తాను సబబని తలచునంత మంది అదనపు జిల్లా రిజిస్ట్రార్లను నియమించవచ్చును. జిల్లా రిజిస్ట్రారు యొక్క సాధారణ నియంత్రణాదేశములకు లోబడి,

జిల్లా రిజిస్ట్రారు యొక్క కృత్యములలో ఆయన నిర్వహించవలసినదిగా ప్రాధికారమిచ్చునట్టి కృత్యములను అదనపు జిల్లా రిజిస్ట్రారులు నిర్వహించవలెను.

(2) ముఖ్య రిజిస్ట్రారు యొక్క ఆదేశములకు లోబడి జిల్లా రిజిస్ట్రారు, ఆ జిల్లాలో జనన మరణముల రిజిస్ట్రీకరణను అధీక్షించవలెను మరియు ఈ చట్టము యొక్క నిబంధనలను, ఈ చట్టము నిమిత్తము ఆయా సమయములలో ముఖ్య రిజిస్ట్రారు జారీచేయు ఉత్తరువులను, అమలుపరచుటకు ఉత్తరదాయి అగును.

7. (1) ఒక పురపాలిక, పంచాయితీ, లేక ఇతర స్థానిక ప్రాధికార సంస్థ యొక్క అధికారితలోని ప్రాంతము లేక ఏదైన ఇతర ప్రాంతము, లేక అట్టి ఏవైన రెండు లేదా అంతకెక్కువ ప్రాంతములు చేరియున్న ప్రతియొక స్థానిక ప్రాంతమునకు రాజ్యప్రభుత్వము ఒక రిజిస్ట్రారును నియమించవచ్చును: రిజిస్ట్రారు.

అయితే, ఒక పురపాలిక, పంచాయితీ లేక ఇతర స్థానిక ప్రాధికార సంస్థ విషయములో దాని అధికారినెవరినైనను లేక ఇతర ఉద్యోగినెవరినైనను రాజ్య ప్రభుత్వము రిజిస్ట్రారుగా నియమించవచ్చును.

(2) ప్రతి రిజిస్ట్రారు, 8వ పరిచ్ఛేదము లేక 9వ పరిచ్ఛేదము క్రింద తనకు ఈయబడిన సకల సమాచారమును అందు నిమిత్తము నిర్వహించెడి రిజిస్టరులో, ఫీజుగాని, పారితోషికముగాని తీసుకొనకుండ, నమోదు చేయవలెను. మరియు తన అధికారితలో సంభవించునట్టి ప్రతి జననమును గూర్చియు ప్రతి మరణమును గూర్చియు జాగ్రత్తగా తెలిసికొనుటకును రిజిస్టరు చేయవలసిన వివరములను కనుగొని రిజిస్టరు చేయుటకును చర్యలు తీసికొనవలెను.

(3) ప్రతి రిజిస్ట్రారుకు, అతనిని నియమించిన స్థానిక ప్రాంతమునందు ఒక కార్యాలయము ఉండవలెను.

(4) ప్రతి రిజిస్ట్రారు, ముఖ్య రిజిస్ట్రారు ఆదేశించునట్టి దినములలోను, అట్టి వేళలందును తన కార్యాలయములో జనన మరణములను రిజిస్టరుచేయు నిమిత్తము హాజరైయుండవలెను మరియు తాను ఏ స్థానిక ప్రాంతమునకు నియమితుడైనాడో ఆ స్థానిక ప్రాంతమునకు జనన మరణముల రిజిస్ట్రారు అను పదములు చేర్చి తన పేరు, తాను హాజరైయుండు దినములు మరియు వేళలు, స్థానిక భాషలో వ్రాయబడియుండు ఒక ఫలకమును తన కార్యాలయము యొక్క బాహ్య ద్వారముపై లేక దాని దగ్గరగా స్పష్టముగా కనుపించు ఒక స్థానమునందు పెట్టించవలెను.

(5) రిజిస్ట్రారు, ముఖ్య రిజిస్ట్రారు యొక్క పూర్వామోదముతో, సబ్ రిజిస్ట్రారులను నియమింపవచ్చును మరియు తన అధికారితలోని నిర్దిష్ట ప్రాంతములకు సంబంధించి తన అధికారములు మరియు కర్తవ్యములలో దేనినైననుగాని అన్నింటినిగాని వారికి అప్పగించవచ్చును.

## అధ్యాయము 3.

## జనన మరణముల రిజిస్ట్రీకరణ.

8. (1) 16వ పరిచ్ఛేదము యొక్క ఉపపరిచ్ఛేదము (1) క్రింద రాజ్య ప్రభుత్వము విహితపరచిన ప్రరూపములో నమోదు చేయవలసినట్టి అనేక వివరములను గూర్చి తమకు తెలిసినంతవరకు, తాను విశ్వసించుచున్నమేరకు సమాచారమును వాగ్రూపమునగాని వ్రాతమూలకమునగాని విహితపరచినట్టి కాలావధిలో రిజిస్ట్రారుకు అందజేయుట లేక అందజేయునట్లు చూచుట ఈ క్రింద నిర్దిష్టపరచిన వ్యక్తుల కర్తవ్యమైయుండును:— జనన మరణములను రిజిస్టరు చేయవలసిన వ్యక్తులు.

(ఏ) ఇందలి (బీ) నుండి (ఈ) వరకుగల ఖండములలో నిర్దేశించిన ఏదేని స్థలముకానట్టి గృహములోని జనన మరణముల విషయమున అది నివాస గృహమైనను, నివాసేతర గృహమైనను, ఆ గృహముయొక్క పెద్ద, లేక ఆ గృహములో ఒకటి కంటే ఎక్కువ కుటుంబములున్నయెడల ఆ కుటుంబ పెద్ద, అనగా ఆ గృహముచే లేక కుటుంబముచే పెద్దగా గుర్తింపుపొందిన వ్యక్తి; జననమును లేక మరణమును గూర్చి రిపోర్టు చేయవలసిన కాలావధిలోపల ఎప్పుడైనను అతడు గృహములో లేని యెడల, ఆ గృహములో నున్నట్టి ఆ పెద్దయొక్క అత్యంత సన్నిహిత బంధువు, మరియు అట్టి ఏ వ్యక్తియు లేనియెడల ఆ కాలావధిలో ఆ గృహములోనున్న అందరి కంటె వయసులో పెద్దవాడగు వయోజన పురుషుడు;

(బీ) ఆసుపత్రి, ఆరోగ్య కేంద్రము, ప్రసూతి లేక నర్సింగుహోం లేక అటువంటి ఇతర సంస్థలోని జనన మరణముల విషయమున, బాధ్యతగల అచటి వైద్యాధికారి లేక ఈ విషయమున అతనిచే ప్రాధికృతుడైన ఏ వ్యక్తియైనను;

(సీ) జైలులోని జనన మరణముల విషయమున, ఆ జైలు బాధ్యతగల జైలరు;

(డీ) ఒక చౌల్ట్రి, సత్రము, హాస్టలు, ధర్మశాల, భోజన గృహము, వసతి గృహము, పూటకూళ్ల యిల్లు, బారకాసు, కల్లు దుకాణము లేక సార్వజనిక సమాగమ స్థలములోని జనన మరణముల విషయమున, దాని బాధ్యతగల వ్యక్తి;

(ఈ) ఒక సార్వజనిక స్థలములో విడిచిపెట్టబడినట్లు కనుగొనబడిన అప్పుడే పుట్టిన శిశువు లేక ఏదేని శవము విషయమున గ్రామమైనచో, ఆ గ్రామముయొక్క గ్రామపెద్ద లేక ఇతర తత్సమానాధికారి, మరియు వేరొకచోట అయినచో స్థానిక పోలీసు స్టేషను బాధ్యతగల అధికారి:

అయితే, అట్టి శిశువును లేక శవమును కనుగొనినట్టి లేక అట్టి శిశువు లేక శవము తన వశమునందు ఉంచబడినట్టి ఏ వ్యక్తియైనను ఆ విషయమును గ్రామపెద్దకు లేక పైన చెప్పబడిన అధికారికి తెలియపరచవలెను.

(ఎఫ్) ఏదేని ఇతర స్థలములో, విహితపరచినట్టి వ్యక్తి.

(2) ఉపపరిచ్ఛేదము (1)లో ఏమి ఉన్నప్పటికిని, ఒక రిజిస్ట్రీకరణ డివిజనులో ఉన్నట్టి పరిస్థితులను దృష్టియందుంచుకొని, రాజ్య ప్రభుత్వము ఉత్తరువు ద్వారా, ఉత్తరువులో నిర్దిష్టపరచిన కాలావధి వరకు ఉపపరిచ్ఛేదము (1) యొక్క ఖండము (ఏ)లో నిర్దేశించిన గృహములోని జనన మరణములను గూర్చిన సమాచారమును ఆ ఖండములో నిర్దిష్టపరచిన వ్యక్తులకు బదులు ఈ విషయమున పదాభిధానముతో రాజ్య ప్రభుత్వము నిర్దిష్టపరచినట్టి ఏ వ్యక్తియైనను అందజేయ వలెనని లేక అందజేయునట్లు చేయవలెనని కోరవచ్చును.

ప్లాంటేషను లోని జనన మరణముల గురించి ప్రత్యేక నిబంధన.

9. ఒక ప్లాంటేషనులోని జనన మరణముల విషయములో, 8వ పరిచ్ఛేదములో నిర్దేశించిన సమాచారమును ఆ ప్లాంటేషను అధీక్షకుడు రిజిస్ట్రారుకు అందజేయ వలెను లేక అందజేయునట్లు చేయవలెను:

అయితే, 8వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1)లోని (ఏ) నుండి (ఎఫ్) వరకుగల ఖండములలో నిర్దేశించిన వ్యక్తులు, ఆవశ్యకమైన వివరములను ఆ ప్లాంటేషను అధీక్షకునికి అందజేయవలెను.

విశదీకరణ:- ఈ పరిచ్ఛేదములో 'ప్లాంటేషను' అను పదమునకు, తేయాకు, కాఫీ, మిరియాలు, రబ్బరు, ఏలకులు, సింకోనా లేక రాజ్య ప్రభుత్వము రాజపత్రములో అధిసూచన ద్వారా నిర్దిష్టపరచునట్టి ఇతర పదార్థములను పండించు టకు తయారు చేయబడుచున్నట్టి లేక వాస్తవముగా పండించబడుచున్నట్టి నాలుగు హెక్టార్లకు తక్కువకాని విస్తీర్ణముగల ఏదేని భూమి అని అర్థము; మరియు

'ప్లాంటేషను అధీక్షకుడు' అను పదబంధమునకు, మేనేజరు అని పిలువబడినను, అధీక్షకుడు అని పిలువబడినను లేక మరే ఇతర పేరుతో పిలువబడినను, ప్లాంటేషనులో శ్రామికులయొక్కయు పనియొక్కయు బాధ్యతను లేక పర్యవేక్షణను వహించుచున్న వ్యక్తి అని అర్థము.

జనన మరణములను తెలియపరచుట మరియు మరణ కారణములను ధ్రువపరచుట కొందరు వ్యక్తుల కర్తవ్యమైయుండుట.

10. (1) తాము పరిచర్యచేసిన లేక ఉండియున్న లేక విహితపరచిన ప్రాంతములలో సంభవించిన ప్రతియొక జననమును లేక మరణమును లేక రెండింటిని విహితపరచినట్టి సమయములోను అట్టి రీతిగను తెలియపరచుట ఈ క్రింద తెలిపిన వ్యక్తుల కర్తవ్యమైయుండును:-

(i) జనన సమయమునగాని మరణ సమయమునగాని పరిచర్యచేసిన మంత్రసాని లేక ఎవరేని యితర వైద్య పరిచారకుడు లేక ఆరోగ్య పరిచారకుడు;

(ii) శవముల సంస్కారమునకై ప్రత్యేకించిన స్థానముయొక్క పాలకుడు, లేక సొంతదారు లేక అట్టి స్థానమునందు హాజరులోనుండవలసినదని ఒక స్థానిక ప్రాధికార సంస్థ కోరినట్టి ఎవరేని వ్యక్తి; లేక

(iii) రాజ్య ప్రభుత్వము ఈ విషయమున పదాభిదానముతో నిర్దిష్టపరచునట్టి ఎవరేని ఇతర వ్యక్తి.

(2) ఏ ప్రాంతములోనైనను, ఈ విషయమున అందు లభ్యమగు సౌకర్యములను దృష్టియందుంచుకొని, మరణ కారణమును గూర్చి విహితపరచినట్టి వ్యక్తి నుండియు మరియు అట్టి ప్రరూపములోను రిజిస్ట్రారు ఒక ధ్రువపత్రమును పొందవలెనని, రాజ్య ప్రభుత్వము కోరవచ్చును.

(3) మరణ కారణమును గూర్చి ధ్రువపత్రమును (సర్టిఫికేటు) పొందవలెనని రాజ్య ప్రభుత్వము ఉప పరిచ్ఛేదము (2) క్రింద కోరినయెడల ఎవరేని మరణించిన వ్యక్తి కడపటిసారి అస్వస్థుడైనప్పుడు వైద్యవృత్తిదారుచే పరిచర్య పొందియుండిన సందర్భములో ఆ వ్యక్తి మరణించిన పిమ్మట, ఆ వైద్యవృత్తిదారు, తనకు తెలిసినంత వరకు తాను విశ్వసించుచున్న మేరకు మరణ కారణమును తెలుపుచు విహిత ప్రరూపములో ఒక ధ్రువపత్రమును ఎట్టి ఫీజును వసూలు చేయకుండ ఆ మరణమునకు సంబంధించిన సమాచారమును అందజేయుటకు ఈ చట్టము క్రింద కోరబడిన వ్యక్తికి వెంటనే జారీచేయవలెను. మరియు అట్టి వ్యక్తి ఆ ధ్రువపత్రమును పొంది, ఈ చట్టము కోరిన ప్రకారము ఆ మరణమును గూర్చిన సమాచారమును అందజేయునప్పుడు రిజిస్ట్రారుకు ఆ ధ్రువపత్రమును ఈయవలెను.

సమాచారము అందించు వ్యక్తి రిజిస్టరులో సంతకము చేయవలసియుండుట.

11. ఈ చట్టము క్రింద కోరినట్టి ఏదేని సమాచారమును రిజిస్ట్రారుకు వాగ్రూపముగా ఇచ్చునట్టి ప్రతియొక వ్యక్తి, ఈ విషయమున నిర్వహించెడి రిజిస్టరులో తన పేరు, వివరణ, నివాస స్థలము వ్రాయవలెను. అతడు వ్రాయలేనివాడైనయెడల ఆ వివరములను రిజిస్ట్రారు నమోదు చేయవలెను. మరియు ఆ వ్యక్తి ఆ రిజిస్టరులో నమోదు చేసిన తన పేరుకు, వివరణకు, నివాస స్థలమునకు ఎదురుగా తన బొటన వ్రేలి ముద్ర వేయవలెను.

రిజిస్టరు చేసిన నమోదుల ఉద్ధృతులను సమాచారమందించు వ్యక్తికి ఈయవలసియుండుట.

12. జననము లేక మరణమును రిజిస్టరు చేయుట పూర్తి అయిన వెంటనే అట్టి జననము లేక మరణమునకు సంబంధించిన రిజిస్టరు నుండి విహితపరచిన వివరముల ఉద్ధృతులను రిజిస్ట్రారు తన చేవ్రాలుచేసి, 8వ పరిచ్ఛేదము లేక 9వ పరిచ్ఛేదము క్రింద సమాచారము అందజేసిన వ్యక్తికి ఉచితముగా ఈయవలెను.

జనన మరణములను ఆలస్యముగా రిజిస్టరు చేయుట.

13. (1) జననము లేక మరణమును రిజిస్టరు చేయుటకు నిర్దిష్టపరచిన కాలావధి ముగిసిన పిమ్మటను, అది సంభవించిన ముప్పది దినముల లోపలను రిజిస్ట్రారుకు తెలియపరచినట్టి ఏదేని జననము లేక మరణమును, విహితపరచినట్టి ఆలస్యపు ఫీజు చెల్లించిన మీదట రిజిస్టరు చేయ

(2) అది సంభవించిన ముప్పది దినముల తరువాతను ఒక సంవత్సరము లోపలను రిజిస్ట్రారుకు తెలియపరచినట్టి, ఏదేని జననము లేక మరణమును, విహిత ప్రాధికారియొక్క వ్రాతమూలక అనుజ్ఞతో మాత్రమే, మరియు విహిత ఫీజు చెల్లించి, ఒక నోటరీ పబ్లికు సమక్షమున లేక రాజ్య ప్రభుత్వముచే ఈ విషయమున ప్రాధికృతుడైన ఎవరేని ఇతర అధికారి సమక్షమున చేయబడిన అఫిడవిటు దాఖలు చేసిన మీదట మాత్రమే రిజిస్టరు చేయవలెను.

(3) అది సంభవించిన ఒక సంవత్సరము లోపల రిజిస్టరు చేయనట్టి ఏదేని జననము లేక మరణమును దాని యదార్థతను సరిచూచిన పిమ్మట, విహిత ఫీజు చెల్లించబడిన మీదట, మొదటి తరగతి మేజిస్ట్రేటుగాని, ప్రెసిడెన్సి మేజిస్ట్రేటుగాని చేసిన ఉత్తరువుపై మాత్రమే రిజిస్టరు చేయవలెను.

(4) ఏ వ్యక్తిపైనైనను, అతడు ఏదేని జననము లేక మరణమును అందుకై నిర్దిష్టపరచిన సమయములోపల రిజిస్టరు చేయకున్నందులకు తీసికొనదగు ఏదేని చర్యకు ఈ పరిచ్ఛేదము యొక్క నిబంధనలు భంగము కలిగించవు మరియు అట్టి ఏదేని చర్య జరుగుచుండగా అట్టి జననము లేక మరణమును రిజిస్టరు చేయవచ్చును.

శిశువు పేరు రిజిస్టరు చేయుట.

14. ఎవరేని శిశువుయొక్క జననమును పేరు లేకుండ రిజిస్టరు చేసినచో, ఆ శిశువుయొక్క తల్లి లేక తండ్రి లేక సంరక్షకుడు, విహిత కాలావధి లోపల ఆ శిశువు పేరును వాగ్రూపమునగాని, వ్రాతమూలకమునగాని రిజిస్ట్రారుకు తెలియజేయవలెను, మరియు అటుపై రిజిస్ట్రారు అట్టి పేరును రిజిస్టరులో నమోదుచేసి, పొడి సంతకము పెట్టి ఆ నమోదు తేదీ వేయవలెను.

జనన మరణముల రిజిస్టరులోని నమోదును సరిచేయుట లేక రద్దు చేయుట.

15. ఈ చట్టము క్రింద రిజిస్ట్రారు ఉంచు ఏదేని రిజిస్టరులో జననమును లేక మరణమును గూర్చిన, ఏదైన నమోదు, ప్రరూపములోగాని, సారతః గాని, తప్పుగా ఉన్నదని లేక కపటపూర్వకముగా గాని అనుచితముగాగాని చేయబడినదని రిజిస్ట్రారుకు నమ్మకము కలుగునట్లు రుజువుపరచినయెడల, అతడు అట్టి నమోదులను ఏ షరతులపై మరియు ఏ పరిస్థితులలో సరిచేయవచ్చునో లేక రద్దుచేయవచ్చునో అను దానిని గూర్చి రాజ్య ప్రభుత్వము చేయునట్టి నియమములకులోబడి, మూల నమోదులో ఎట్టి మార్పు చేయకుండ మార్జినులో యథోచిత నమోదు ద్వారా ఆ తప్పును సరిచేయవచ్చును, లేక ఆ నమోదును రద్దుచేయవచ్చును. మరియు ఆ మార్జినులోని నమోదు ప్రక్క సంతకముచేసి, సరిచేసిన లేక రద్దుచేసిన తేదీని ఆ సంతకమునకు చేర్చవలెను.

## అధ్యాయము 4.

## రికార్డుల మరియు గణాంకముల నిర్వహణ.

రిజిస్ట్రారుల్ల రిజిస్టర్లను విహిత ప్రరూప ములో ఉంచ వలసియుండుట.

16. (1) ప్రతి రిజిస్ట్రారు తాను అధికారితను వినియోగించుచున్నట్టి రిజిస్ట్రే కరణ ప్రాంతమునకు లేక అందలి ఏదేని భాగమునకు ఒక జనన మరణముల రిజిస్టరును విహిత ప్రరూపములో ఉంచవలెను.

(2) ఆయా సమయములందు విహితపరచినట్టి ప్రరూపములను, అనుదేశములను అనుసరించి జనన మరణములను నమోదుచేయుట కొరకు చాలినన్ని రిజిస్టరు పుస్తకములను ముఖ్య రిజిస్ట్రారు ముద్రింపచేసి సరఫరా చేయించవలెను, మరియు స్థానిక భాషలో అట్టి ప్రరూపముల ప్రతి నొకదానిని ప్రతి రిజిస్ట్రారు కార్యాలయము యొక్క బాహ్య ద్వారముపై గాని దాని దగ్గరగా గాని బాగుగా కనపడు ఏదేని స్థలములో ప్రదర్శించవలెను.

జనన మరణముల రిజిస్టరు నోదాచేయుట.

17. (1) ఫీజు మరియు తపాల చార్జి చెల్లింపునకు సంబంధించిన నియమము లతో సహా రాజ్య ప్రభుత్వము ఈ విషయమున చేసిన ఏవేని నియమములకు లోబడి, ఏ వ్యక్తియైనను—

(ఏ) జనన మరణముల రిజిస్టరులోని ఏదేని నమోదు కొరకు రిజిస్ట్రారుచే సోదా చేయించవచ్చును; మరియు

(బీ) అట్టి రిజిస్టరు నుండి ఏదేని జననము లేక మరణమునకు సంబంధించిన ఉదాహృతిని పొందవచ్చును:

అయితే, ఏదేని మరణమునకు సంబంధించి ఏ వ్యక్తికైనను జారీచేసినట్టి ఏదేని ఉదాహృతిలో, ఆ రిజిస్టరులో నమోదు చేసిన, మరణ కారణమును గూర్చిన వివరములను వెల్లడించకూడదు.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద ఇచ్చిన అన్ని ఉదాహృతులను రిజిస్ట్రారుగాని, భారత సాక్ష్య చట్టము, 1872 యొక్క 76వ పరిచ్ఛేదములోని నిబంధనల ప్రకారము ఉదాహృతులను ఇచ్చుటకు రాజ్య ప్రభుత్వముచే ప్రాధికృతుడైనట్టి ఎవరేని ఇతర అధికారిగాని, ధ్రువపరచవలెను మరియు వాటిని ఆ నమోదు దేనికి సంబంధించినదో, ఆ జననమును లేక మరణమును రుజువుపరచు నిమిత్తము సాక్ష్యముగా స్వీకారయోగ్యమైనవగును. 1872లో 1

18. జిల్లా రిజిస్ట్రారు నిర్దిష్టపరచునట్టి రీతిగా మరియు అట్టి ప్రాధికారి రిజిస్ట్రీకరణ కార్యాలయములను తనిఖీ చేయవలెను మరియు అందు ఉంచిన రిజిస్టర్లను పరీక్షించవలెను.

రిజిస్ట్రీకరణ కార్యాలయముల తనిఖీ.

19. (1) ప్రతి రిజిస్ట్రారు తాను ఉంచిన రిజిస్టరులోని జనన మరణముల నమోదులను గురించిన వివరణి నొకదానిని, విహితపరచునట్టి అంతరావధులలోను, అట్టి ప్రరూపములలోను ముఖ్య రిజిస్ట్రారుకుగాని అతడు నిర్దిష్టపరచిన ఎవరేని అధికారికి గాని పంపవలెను.

రిజిస్ట్రార్లు నియతకాలిక వివరణులను సంకలనము కొరకు ముఖ్య రిజిస్ట్రారుకు పంపవలసి యుండుట.

(2) ముఖ్య రిజిస్ట్రారు, రిజిస్ట్రార్లు అందజేసిన వివరణులలోని సమాచారమును సంకలనము చేయించి, ఆ సంవత్సరములో రిజిస్టరయిన జనన మరణములపై ఒక గణాంక రిపోర్టును ప్రజలందరి ఎరుకకొరకు, విహితము చేయునట్టి అంతరావధులలోను, ప్రరూపములలోను ప్రచురణ చేయవలెను.

## అధ్యాయము 5.

## వివిధ విషయములు.

20. (1) ఈ విషయమున కేంద్ర ప్రభుత్వము చేయునట్టి నియమములకు లోబడి, పౌరసత్వ చట్టము, 1955 క్రింద భారతదేశమునకు వెలుపల నున్న భారత పౌరుల జనన మరణములను భారతీయ కాన్సలేట్లలో రిజిస్టరు చేయుటకు సంబంధించి చేసిన నియమముల ననుసరించి అట్టి పౌరుల రిజిస్ట్రీకరణను గూర్చి తనకందిన సమాచారమును రిజిస్ట్రారు-జనరలు రిజిస్టరు చేయించవలెను మరియు అట్టి ప్రతి రిజిస్ట్రీకరణను కూడ ఈ చట్టము క్రింద తగు రీతిగా చేసినట్లు భావించవలెను.

భారతదేశము వెలుపలనున్న పౌరుల జనన మరణముల రిజిస్ట్రీకరణను గూర్చి ప్రత్యేక నిబంధన. 1955 లో 57

(2) భారతదేశమునకు వెలుపల జన్మించిన ఏ శిశువును గూర్చి ఉప పరిచ్ఛేదము (1)లోని నిబంధనానుసారముగా సమాచారము అందలేదో ఆ శిశువుయొక్క తల్లిదండ్రులు భారతదేశములో స్థిర నివాసమేర్పరచుకొను ఉద్దేశముతో భారతదేశమునకు తిరిగి వచ్చినయెడల, వారు, ఆ శిశువు భారతదేశమునకు వచ్చిన తేదీ నుండి అరువది దినముల లోపల ఎప్పుడైనను, ఆ శిశువు భారతదేశమున జన్మించి యుండిన ఎట్లో అట్లే అదే రీతిగా ఆ శిశువుయొక్క జననమును ఈ చట్టము క్రింద రిజిస్టరు చేయించవచ్చును, మరియు పైన చెప్పిన అరువది దినముల కాలావధి ముగిసిన పిమ్మట 13వ పరిచ్ఛేదపు నిబంధనలు, అట్టి శిశువు జననమునకు వర్తించును.

జననము లేక మరణమును గురించిన సమాచారమును సేకరించుటకు రిజిస్ట్రారుకుగల అధికారము.

21. ఏ వ్యక్తియైనను, అతడు నివసించు వాడలో సంభవించిన ఏదేని జననమునకు లేక మరణమునకు సంబంధించి అతనికి తెలిసిన సమాచారమును అందజేయవలసినదిగా వాగ్రూపమునగాని, వ్రాతమూలకమునగాని, రిజిస్ట్రారు కోరవచ్చును. అట్టి అభ్యర్థనను పాటించుట ఆ వ్యక్తికి తప్పనిసరియై ఉండును.

ఆదేశములిచ్చుటకు గల అధికారము.

22. ఈ చట్టముయొక్క లేక ఈ చట్టము క్రింద చేసిన ఏదేని నియమము లేక ఉత్తరువుయొక్క నిబంధనలలో వేటినైనను ఏదేని రాజ్యములో అమలుపరచుటకు అవశ్యకమని తోచునట్టి ఆదేశములను కేంద్ర ప్రభుత్వము ఆ రాజ్య ప్రభుత్వమునకు ఈయవచ్చును.

శాస్తులు.

23. (1) ఈ క్రింది వ్యక్తి ఎవరైనను, అనగా—

(ఏ) 8వ మరియు 9వ పరిచ్ఛేదముల నిబంధనలలో దేని క్రిందనైనను ఏదైన సమాచారమును అందజేయుట తన కర్తవ్యమైయుండి యుక్తమైన కారణములు లేకుండ అందజేయకుండు వ్యక్తి లేక;

(బీ) తెలుసుకొని రిజిస్ట్రరు చేయించవలసిన వివరములలో అసత్యమైనదని తనకు తెలిసియున్నట్టి, లేక అసత్యమైనదని తాను విశ్వసించుచున్నట్టి ఏదేని సమాచారమును జనన, మరణముల రిజిస్ట్రరులో చేర్చు నిమిత్తమై అందజేయు లేక అందజేయించు వ్యక్తి; లేక

(సీ) 11వ పరిచ్ఛేదము ద్వారా కోరినట్లు రిజిస్ట్రరులో తన పేరు, వివరణ, నివాస స్థలము వ్రాయుటకు లేక తన బొటన వ్రేలిముద్ర వేయుటకు నిరాకరించు వ్యక్తి,

ఏబది రూపాయలదాక ఉండగల జుర్మానాతో శిక్షింపదగియుండును.

(2) తన అధికారితా క్షేత్రమందు సంభవించు ఏదేని జననమునుగాని, మరణమునుగాని యుక్తమైన కారణము లేకుండా రిజిస్ట్రరు చేయుటను లేక 19వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) ద్వారా కోరినట్టి ఏవేని వివరణలను సమర్పించుటను ఉపేక్షించు లేదా అట్లు రిజిస్ట్రరు చేయుటకు లేక సమర్పించుటకు నిరాకరించు ఏ రిజిస్ట్రారైనను లేక సబ్-రిజిస్ట్రారైనను ఏబది రూపాయల దాక ఉండగల జుర్మానాతో శిక్షింపదగియుండును.

(3) 10వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (3) క్రింద ఒక ధ్రువపత్రమును జారీచేయుటను ఉపేక్షించు లేక జారీచేయుటకు నిరాకరించు ఏ వైద్యవృత్తిదారైనను మరియు అట్టి ధ్రువపత్రమును అందించుటను ఉపేక్షించు లేక అందించుటకు నిరాకరించు ఏ వ్యక్తియైనను ఏబది రూపాయల దాక ఉండగల జుర్మానాతో శిక్షింపదగియుండును.

(4) ఈ చట్టములోని ఏదేని నిబంధనయొక్క ఉల్లంఘనకు ఈ పరిచ్ఛేదములో ఏ శాస్తియు లేనిచో, ఆ నిబంధనను యుక్తమైన కారణము లేకుండ ఉల్లంఘించు ఏ వ్యక్తియైనను పది రూపాయలదాక ఉండగల జుర్మానాతో శిక్షింపదగియుండును.

1898లో 5

(5) క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1898లో ఏమియున్నప్పటికిని, ఈ పరిచ్ఛేదము క్రింది అపరాధమును మేజిస్ట్రేటు సంక్షిప్తముగా విచారణ జరుపవలెను.

అపరాధములను రాజీచేయుటకు అధికారము.

24. (1) విహితపరచునట్టి షరతులకులోబడి, ముఖ్య రిజిస్ట్రారు, ఈ విషయమున ఒక సాధారణ లేక ప్రత్యేక ఉత్తరువు ద్వారా ప్రాధికారమొసగినట్టి ఏ అధికారియైనను, ఈ చట్టము క్రింద అపరాధము చేసిన లేక చేసినట్లు యుక్తముగా అనుమానించిన వ్యక్తి నుండి, అట్టి అపరాధమును రాజీచేయుచు ఏబది రూపాయలకు

మించని మొత్తమును ఈ చట్టము క్రింద క్రిమినలు చర్యలు ప్రారంభించుటకు పూర్వముగాని తర్వాతగాని, స్వీకరించవచ్చును.

(2) అట్టి మొత్తమును చెల్లించిన మీదట, అట్టి వ్యక్తిని ఉన్మోచితుని చేయవలెను. మరియు అట్టి అపరాధమును గూర్చి అతనిపై మరే చర్యలను తీసుకొనరాదు.

25. ఈ చట్టము క్రింద శిక్షింపదగు అపరాధము విషయమున అభియోగమేదియు, ముఖ్య రిజిస్ట్రారు, ఈ విషయమున సాధారణ లేక ప్రత్యేక ఉత్తరువు ద్వారా ప్రాధికారమొసగిన అధికారి తప్ప తేరాదు. అభియోగమునకు మంజూరీ.

26. ఈ చట్టముయొక్క నిబంధనలననుసరించి లేక వాటి క్రింద చేసిన ఏదేని నియమము లేక ఉత్తరువుననుసరించి వ్యవహరించుచున్న లేక వ్యవహరించుచున్నట్లు తాత్పర్యమగునట్టి, అందరు రిజిస్ట్రారుల్లు మరియు సబ్-రిజిస్ట్రారుల్లు భారత శిక్షాస్మృతి 21వ పరిచ్ఛేదపు భావములో పబ్లిక్కు సేవకులుగా భావించబడుదురు. రిజిస్ట్రారుల్లు మరియు సబ్-రిజిస్ట్రారుల్లు పబ్లిక్ సేవకులుగా భావించబడుట. 1860లో 45

27. రాజ్య ప్రభుత్వము ఈ చట్టము క్రింద లేక దీని ననుసరించి చేసిన నియమముల క్రింద తాను వినియోగించదగు ఏ అధికారమునైనను (30వ పరిచ్ఛేదము క్రింద నియమములను చేయుటకుగల అధికారము తప్ప) రాజపత్రములో అధిసూచించిన ఆదేశము ద్వారా అందు నిర్దిష్టపరచు షరతులేవేనియున్నయెడల, వాటికి లోబడి, ఆ ఆదేశములో నిర్దిష్టపరచునట్టి తన అధీనస్థుడైన ఏ అధికారియైనను లేక ఏ ప్రాధికారియైనను కూడ వినియోగింపదగునని ఆదేశించవచ్చును. అధికారముల ప్రత్యాయోజనము.

28. (1) ఈ చట్టముననుసరించి లేక ఈ చట్టము క్రింద చేసిన ఏదేని నియమము లేక ఉత్తరువుననుసరించి సద్భావపూర్వకముగా చేసిన లేక చేయుటకు ఉద్దేశించిన ఏ చర్యకైనను ప్రభుత్వముపైగాని రిజిస్ట్రారు-జనరలుపైగాని, ఏ రిజిస్ట్రారుపైగాని, ఈ చట్టము క్రింద ఏదేని అధికారమును వినియోగించుచున్న లేక ఏదేని కర్తవ్యమును నిర్వర్తించుచున్న ఏ వ్యక్తిపైగాని ఎట్టి దావా, అభియోగము, లేక ఇతర శాసనబద్ధ చర్యవుండదు. సద్భావపూర్వకముగ తీసికొనిన చర్యకు రక్షణ.

(2) ఈ చట్టముననుసరించి లేక ఈ చట్టము క్రింద చేసిన ఏదేని నియమము లేక ఉత్తరువుననుసరించి సద్భావపూర్వకముగా చేసిన లేక చేయుటకు ఉద్దేశించినట్టి దేనివలన గాని కలిగిన లేక కలుగగల ఏదేని నష్టమునకై ప్రభుత్వముపై ఎట్టి దావా లేక ఇతర శాసనబద్ధ చర్య ఉండదు.

29. ఈ చట్టములోనున్నదేదియు, జనన మరణముల మరియు వివాహముల రిజిస్ట్రీకరణ చట్టము, 1886 యొక్క నిబంధనలకు భంగము కలిగించునదిగా అన్వయించరాదు. ఈ చట్టము, 1886 లోని 6వ చట్టమునకు భంగము కలిగించకుండుట.

30. (1) ఈ చట్టపు ప్రయోజనములను నెరవేర్చుటకు రాజ్య ప్రభుత్వము కేంద్ర ప్రభుత్వముయొక్క ఆమోదముతో రాజపత్రములో అధిసూచన ద్వారా నియమములను చేయవచ్చును. నియమములు చేయుటకు అధికారము.

(2) ప్రత్యేకించియు, పైన చెప్పిన అధికారముయొక్క వ్యాపకతకు భంగము లేకుండను, అట్టి నియమములలో, ఈ క్రింది విషయములకై, నిబంధనలు చేయవచ్చును:-

(ఏ) ఈ చట్టము క్రింద ఉంచవలసిన జనన మరణముల రిజిస్టర్ల ప్రరూపములు;

(బీ) 8వ పరిచ్ఛేదము క్రింద రిజిస్ట్రారుకు సమాచారమును ఏ కాలావధి లోపల ఏ ప్రరూపములో మరియు ఏ రీతిగా అందజేయవలెను;

(సి) 10వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) క్రింద జనన మరణములను గురించి ఏ కాలావధిలోపల మరియు ఏ రీతిగా తెలియపరచవలెను;

(డి) మరణ కారణమును గూర్చిన ధ్రువపత్రమును ఏ వ్యక్తి నుండి మరియు ఏ ప్రరూపములో పొందవలెను;

(ఈ) 12వ పరిచ్ఛేదము క్రింద ఈయదగినట్టి, ఉదాహృతి వివరములు;

(ఎఫ్) జననమునుగాని మరణమునుగాని 13వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2) క్రింద రిజిస్టరు చేయుటకు అనుజ్ఞను మంజూరుచేయు ప్రాధికారి;

(జీ) 13వ పరిచ్ఛేదము క్రింద రిజిస్టరు చేయుటకొరకు చెల్లించదగు ఫీజు;

(హెచ్) ముఖ్య రిజిస్ట్రారుచే 4వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4) క్రింద రిపోర్టుల సమర్పణ;

(ఐ) జనన మరణముల రిజిస్టర్ల సోదా మరియు అట్టి సోదాకొరకును, రిజిస్టర్ల నుండి ఉదాహృతుల మంజూరీ కొరకును చెల్లించదగు ఫీజు;

(జే) 19వ పరిచ్ఛేదము క్రింద వివరణలు మరియు గణాంక రిపోర్టులను ఏ ప్రరూపములో మరియు ఏ అంతరావధులలో అందజేయవలెను మరియు ప్రచురించవలెను;

(కే) రిజిస్ట్రార్లు ఉంచిన రిజిస్టర్లయొక్కయు ఇతర రికార్డులయొక్కయు అభిరక్ష, దాఖలు మరియు అంతరణ;

(ఎల్) జనన మరణముల రిజిస్టరులో తప్పులను సరిచేయుట మరియు నమోదులను రద్దుచేయుట;

(యమ్) విహితపరచవలసిన లేక విహితపరచదగు ఏదేని ఇతర విషయము.

(3) ఈ చట్టము క్రింద చేసిన ప్రతి నియమమును దానిని చేసిన పిమ్మట వీలైనంత శీఘ్రముగా రాజ్యశాసనమండలి సమక్షమున ఉంచవలెను.

**రద్దు మరియు వ్యావృత్తి.**

31. (1) ఈ చట్టమునందలి విషయములకు సంబంధించి, ఏదైన రాజ్యములో లేక రాజ్య భాగములో అమలులోనున్నట్టి ఏదేని శాసనము, అది అట్లు సంబంధించి యున్న మేరకు, 29వ పరిచ్ఛేదపు నిబంధనలకులోబడి, అట్టి రాజ్యములో, లేక సందర్భానుసారముగా రాజ్య భాగములో ఈ చట్టము అమలులోనికి వచ్చినప్పటి నుండి రద్దు అగును.

(2) అట్లు రద్దు అయినప్పటికిని, అట్టి శాసనము క్రింద (జారీచేసిన ఏదేని అనుదేశము లేక ఆదేశము మరియు చేసిన ఏదేని వినియమము, నియమము లేక ఉత్తరువుతో సహా) చేసిన ఏదేని పని, లేక తీసికొనిన ఏదేని చర్య, ఈ చట్టపు నిబంధనలకు అసంగతముగా లేనంత వరకు, అట్టి పని చేసినపుడు లేక చర్య తీసికొనినప్పుడు పైన చెప్పిన నిబంధనలు అమలులో నుండి యుండిన ఎట్లో అట్లే, ఆ నిబంధనల క్రింద చేసినట్లు లేక తీసికొనినట్లు భావించవలెను మరియు ఈ చట్టము క్రింద చేసిన ఏదేని పని ద్వారా, లేక తీసికొనిన ఏదేని చర్య ద్వారా త్రోసిపుచ్చబడు వరకు, ఆ ప్రకారము అమలులో కొనసాగుచుండును.

**చిక్కు తొలగించుటకు అధికారము.**

32. ఒక రాజ్యమునందలి ఏదేని ప్రాంతమునకు ఈ చట్టపు నిబంధనలను వర్తింపచేయుటలో, వాటిని అమలుపరచుటయందు ఏదేని చిక్కు ఏర్పడినయెడల ఈ చట్టపు నిబంధనలకు అసంగతము కాకుండను, కేంద్ర ప్రభుత్వముయొక్క ఆమోదము తోను ఉత్తరువు ద్వారా, రాజ్య ప్రభుత్వము ఆ చిక్కును తొలగించుటకు ఆవశ్యకమని లేక ఉపయుక్తమని తనకు తోచునట్టి నిబంధనలను చేయవచ్చును లేక అట్టి ఉత్తరువులను ఈయవచ్చును:

అయితే, ఒక రాజ్యములో ఏదేని ప్రాంతమునకు సంబంధించి ఈ పరిచ్ఛేదము క్రింద ఉత్తరువేదియు, ఆ ప్రాంతములో ఈ చట్టము అమలులోనికి వచ్చినట్టి తేదీ నుండి రెండు సంవత్సరములు గడచిన పిమ్మట చేయబడరాదు.